కథ

# రూపాంతరం

చింతకింది శివశంకర్
99123 24492

"అమ్మా!"..

హరిహరన్ అరుస్తూ ఇంట్లోకి వచ్చాడు.

''కిచెన్‌లో ఉన్నా..'' అని అరిచినట్టే చెప్పింది శారదాంబ.

వంటగదిలో గుత్తివంకాయలకు మసాలా పెడుతున్న శారద, పక్కన టమాటాలు కోస్తున్న చంద్రశేఖర్.. ఇద్దరూ కొడుకువైపు చూశారు.

హరి మొహం నిండా నవ్వు.

''ఏమైంది హరీ?''.

''నాకు ఎయిమ్స్‌లో మెడికల్ సీటు వచ్చింది డాడీ!''.

చంద్రశేఖర్ వచ్చి హరిని హత్తుకున్నాడు. శారద కళ్ల నిండా నీళ్లు. దీనికోసం హరి ఎంత కష్టపడ్డాడో వాళ్లకు తెలుసు. శారద వచ్చి కొడుక్కు స్వీట్ తినిపించింది.

''ఇప్పటినుంచి డాక్టర్ హరిహరన్. సన్నాఫ్ చంద్రశేఖర్! ఈ విషయం అందరికీ చెప్పాలి!''.. పుత్రోత్సాహంతో పొంగిపోతున్నాడు చంద్రశేఖర్.

''అక్కర్లేదు డాడీ.. కాసేపైతే ప్రెస్‌వాళ్లు వస్తారు''.

అన్నట్టుగానే ప్రెస్‌వాళ్లు వచ్చారు. వాళ్లు అడిగినదానికి సమాధానాలు ఇస్తున్నాడు హరి.

''ఇదంతా మా అమ్మనాన్నల వల్లే సాధ్యమైంది'' అని చెప్పాడు.

ప్రెస్‌వాళ్లు చంద్రశేఖర్‌నూ అడిగారు.

''చాలా గర్వంగా ఉంది. నా కొడుకు ఒక తరానికి ఆదర్శంగా నిలబడ్డాడు'' అన్నాడు.

బంధువుల నుంచి, ఫ్రెండ్స్ నుంచీ అభినందిస్తూ చాలా ఫోన్స్ వచ్చాయి.

ఆ తర్వాత ఎమ్మెల్యే రాజవర్ధన్‌ను కలిశారు.

''మీకు ఎలాంటి సాయం కావాలన్నా నన్ను అడగండి. నీ కొడుకులాంటోడు ఊరికి ఒక్కడుంటే చాలు.. దేశం ఎప్పుడో బాగుపడేది!''.

ఎమ్మెల్యే మాటలకు చంద్రశేఖర్ ఆనందంతో తల ఊపుతున్నాడు. హరిని హత్తుకొని..

''హరిహరన్.. నువ్వు మీ నాన్ననే కాదు, మన నియోజకవర్గం మొత్తం తల ఎత్తుకునేలా చేశావ్!''.

హరికి ఇబ్బందిగా ఉన్నా.. ఏమీ అనలేకపోయాడు.

* * *

''హలో!''.

''ఆ.. అమ్మా!''.

''ఏంట్రా ఈమధ్య ఫోన్ చేయడం లేదు. కొంపదీసి.. ఎవరినైనా ప్రేమిస్తున్నావా ఏంటి?''.

అటునుంచి ఏ సమాధానమూ లేదు. పెళ్లి, అమ్మాయిల గురించి కానీ మాట్లాడితే హరి పెద్దగా ఏం మాట్లాడడు. హరి చాలారోజుల నుంచి ఫోన్ చేయకపోతే చాలు.. ఇదే విషయం గురించి శారద ఆటపట్టిస్తుంది.

''మా కోడలిని ఎప్పుడు పరిచయం చేస్తున్నావ్?''.

''అలాంటిదేం లేదమ్మా''.

''ఉంటే చెప్పు రా.. మాకే ప్రాబ్లంలేదు. మాదీ లవ్ మ్యారేజే! మేమంటే మావాళ్లతో కొట్లాడి ఒప్పించుకున్నాం. నీకా ప్రాబ్లంలేదు. మాకు ఉన్నది నువ్వొక్కడివే!''.

''అబ్బా.. అదంతా అయ్యే పని కాదులేమ్మా!''.

''అయితే, ఎవరూ లేరా..?''.

''ఎవరూ లేరు. నెక్ట్స్ మంత్ ఫిఫ్త్ సెమిస్టర్ ఎగ్జామ్స్ ఉన్నాయి. అందుకే చదువుకుంటున్నా.. అంతే!''.. కొట్టినట్టుగా చెప్పాడు.

'అమ్మాయిల గురించి అంటే చాలు, కంగారుపడిపోతాడు. ఎలా బతుకుతాడో ఏమో..!?' అనుకొని ఫోన్ పెట్టేసింది శారద.

* * *

సూర్యుడు చీకట్లో కలవడానికి సిద్ధం అవుతున్నాడు. శారద, హరి ఇంటి పక్కనున్న పార్క్‌లో నడుస్తున్నారు. అక్కడ చాలా ప్రేమజంటలు ఉన్నాయి. హరి మాత్రం సైలెంట్‌గా ఉన్నాడు.

''ఆ అమ్మాయి చూడు.. నవ్వితే ఎంత బాగుందో! నువ్వు ప్రేమించిన అమ్మాయి కూడా ఇలాగే ఉంటుందా!?'' మళ్లీ ఆటపట్టిస్తున్నది తల్లి.

''ఆ అబ్బాయి కూడా నవ్వితే భలే ఉన్నాడు. బుగ్గలు సొట్ట పడుతున్నాయి. బాడీ, హెయిర్ స్టయిల్ కూడా బాగుంది!''.. అంటున్న హరి కళ్లలో ఈర్ష్య..

హరివైపు చూసింది శారద. ఎప్పుడు అమ్మాయిల గురించి మాట్లాడినా, అలిగినట్టు ఉంటాడు. ఇప్పుడు అలా లేడు. శారద ముందుకు నడుస్తూ..

''నీ ఇంటర్న్‌షిప్ అయిపోగానే పెళ్లి చేయాలని చూస్తున్నాడు మీ నాన్న. ఇప్పటికే చాలా సంబంధాలు వస్తున్నాయి. మీ నాన్న ఫ్రెండ్ రఘునాథం అయితే చాలా సార్లు అడిగాడు. మీ నాన్నేమో.. 'మావాడు ప్రేమించిన అమ్మాయినే పెళ్లి చేసుకుంటాడు' అని చెప్పుకొంటూ తిరుగుతున్నాడు. నువ్వు ఎవరినైనా ప్రేమిస్తే చెప్పు!'' అంటూ చూసింది. హరి వెనకాలే ఆగిపోయాడు.

''ఏమైంది?''..

హరి ఏమీ మాట్లాడలేదు.

''కోపమొచ్చిందా?''.

హరి నేల చూపులు చూస్తున్నాడు.

''చూడు హరీ.. ప్రతి ఒక్కరూ ప్రేమ గురించి ఇంట్లో చెప్పడానికి భయపడతారు. నీవు భయపడాల్సిన పని లేదు. ఏమున్నా అమ్మతో చెప్పేయి! అమ్మ చూసుకుంటుంది. సరేనా!''.. గదవ పట్టుకొని చెప్పింది.

ఒకసారి గట్టిగా శ్వాస పీల్చి వదిలాడు. ఆ శ్వాసలోనే హరి భయాలన్నీ కొట్టుకుపోయాయి.

''అమ్మా.. ఇలా రా!'' అని పక్కనే ఉన్న బెంచీపై కూర్చోబెట్టాడు.

ఎవరైనా అమ్మాయి పేరు చెప్తాడని ఆశగా, నవ్వుతూ కూర్చుంది శారద.

హరి ఆమె ముందు మోకాళ్ల మీద కూర్చున్నాడు.

''అమ్మా!''.

చీకట్లు సూర్యుణ్ని మింగేయడం వల్ల, అతని కళ్లలో భయం కనిపించడంలేదు. కానీ, గొంతులో వినిపించింది.

''అమ్మ దగ్గర చెప్పడానికి భయం ఎందుకు హరి?'' అని అతని చేతిని తన చేతుల్లోకి తీసుకుంది.

''అమ్మా.. నాకు ఒకమ్మాయి జీవితాన్ని నాశనం చేయడం ఇష్టంలేదు'' అని తల కిందికి దింపుకొన్నాడు.

శారదకు ఏమీ అర్థంకాలేదు.

''అమ్మా! నాకు అమ్మాయిలు నచ్చరు. నేను 'గే'ని''.

అంతరిక్షంలోని ఉల్క వచ్చి ఆమె నెత్తిన పడింది. తల వెయ్యి ముక్కలై మళ్లీ అతుక్కుంది. ఆమె కాళ్ల కింద భూమి కదలడం ఆమెకు తెలుస్తున్నది. ఆమె నవ్వు కూడా సూర్యునిలాగే చీకట్లో కలిసిపోయింది.

''ఈ విషయం డాడీకి నువ్వే చెప్పాలి'' అని అలాగే ఒళ్లో పడుకున్నాడు.

అతని గొంతులో కంటే, అతని కళ్లలోనే తడి ఎక్కువగా ఉంది.

''ఈ విషయం మీకు చాలాసార్లు

